సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- టీడీపీ కార్యకర్తలు పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానం

కోడూరు: సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోడూరులో టీడీపీ బీసీ, ముస్లిం మైనార్టీలకు చెందిన క్రియాశీలక కార్యకర్తలు పలువురు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, పార్టీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావులు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముస్లిం మైనార్టీ నేతలు షేక్ మున్నా, ఎస్‌డీ మౌలాలి, షేక్ నజీర్, బీసీ నేతలు యార్లగడ్డ మార్క్స్, కారంకి శ్రీనివాసరావు, యర్రారెడ్డివారిపాలెంకు చెందిన కాపు సామాజిక వర్గానికి చెందిన సనకా వీరరాఘవయ్యలతో పాటు మరి కొందరు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌లో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ముస్లిం మైనార్టీల సంక్షేమానికి చేస్తున్న కృషితో పాటు పేదలకు అందిస్తున్న పథకాలు తమను ఆకట్టుకున్నాయని వారు తెలిపారు. సామాజిక సాధికార యాత్ర సాగుతున్న తరుణంలో టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరడం శుభ పరిణామమని, అన్ని వర్గాలవారికీ సమన్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రమేష్‌బాబు అన్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధికి కాము కట్టుబడి ఉన్నామని, వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, మండల కన్వీనర్ వరికె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.


టీడీపీ నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేష్‌బాబు, నరసింహారావు

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం

అవనిగడ్డ: స్థానిక ఏ1 మార్ట్ హాల్‌లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం బహుమతులు అందజేశారు. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8, 9 తరగతి విద్యార్థులకు మానేపల్లి బాలకోటేశ్వరరావు లక్ష్మీనరసమ్మ మెమోరియల్ ట్రస్ట్, దేసు వెంకట సుబ్బారావు ధనలక్ష్మీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. టాలెంట్ టెస్ట్‌లో పులిగడ్డ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. 8వ తరగతి విభాగంలో కె. నవీన్‌కుమార్ మొదటి బహుమతి సాధించగా, అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన టి. వెంకట అవినాష్ ద్వితీయ, కోడూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని వి. శ్రావ్య తృతీయ బహుమతి పొందారు. 9వ తరగతి విభాగంలో పులిగడ్డ గురుకుల పాఠశాల విద్యార్థి కె. మనోజ్ ప్రథమ, స్వతంత్రపురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని బి. ప్రవల్లిక ద్వితీయ, ఈజ వల్లవి తృతీయ బహుమతి సాధించారు. వీరితో పాటు రెండు విభాగాల్లో మరో 9 మందికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. ఏఈవో ఎస్. శివశంకరరావు, పోటీ నిర్వాహకులు మానేపల్లి కోటయ్య దంపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అవనిగడ్డ: నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నలుగురికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు రూ.2.61 లక్షల విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో చల్లపల్లి మండలానికి చెందిన ఇద్దరికి, ఘంటసాల, మోపిదేవి మండలాలకు చెందిన ఒక్కొక్కరికి కలిపి మొత్తం రూ.2,61,000 విలువగల చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వామివారి శాంతి కల్యాణం



మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. చంద్రగ్రహణం అనంతరం ఉదయం ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో వేద పండితులు సంప్రోక్షణ నిర్వహించి 8 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారి శాంతి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేదలకు రగ్గుల పంపిణీ



అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని మండలిపురంలో 50 మంది పేదలకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిశోర్ నాయుడు రగ్గులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో పేదలు చలిని తట్టుకునేందుకు వీటిని అందజేశామని చెప్పారు. వార్డు మాజీ సభ్యుడు దేగల రాఘవ, తోట నరసింహనాయుడు, లీలా ఫణీంద్ర పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కోడూరు: మందపాకల శివారు చింతకోళ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పేరే చంటి ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను నాయకులు ఆదివారం పరామర్శించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ రూ.5 వేల నగదును అందించారు. ఎంపీటీసీలు బడే గంగాధరరావు, వరికె వెంకటేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు పరామర్శించారు.

166 మందికి నేత్ర వైద్య పరీక్షలు




నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక మారుతీ విద్యా నికేతన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని నాగాయలంక ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఆస్పత్రి సిబ్బందితో కలిసి డాక్టర్ రియా 166 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 130 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించేందుకు రెండు ప్రత్యేక బస్సుల్లో పెదకాకానిలోని ఆస్పత్రికి తరలించామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు. జమీలా మస్తాన్, కనిగంటి వెంకట నారాయణ, మత్తి శివ, తలశిల లీలా మనోహర్ తదితరులు రోగులకు సేవలందించారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

గూడూరు: హజ్రత్ గౌసె ఆజం దస్తగీర్ సంస్మరణ వేడుకల్లో భాగంగా ఆదివారం గూడూరు మండలంలోని ముస్లింలు గ్యార్మీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆకులమన్నాడులోని మహబూబ్ సుభానీ జెండా వద్ద, పినగూడూరులోని దర్గా వద్ద నిర్వహించిన వేడుకలలో భాగంగా శనివారం రాత్రి పుస్తక పఠనం జరిగింది. మత గురువులు హజ్రత్ గౌసె ఆజం దస్తగీర్ జీవిత చరిత్రను పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆకుపచ్చని జెండాలను ఆవిష్కరించారు. అనంతరం తబర్రుక్ పంపిణీ చేశారు. రెండు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి. స్థానిక మత గురువులు, ముస్లింలు పాల్గొన్నారు.

ఆలయాల్లో సంప్రోక్షణ



కోడూరు: చంద్ర గ్రహణంతో మూతపడిన ఆలయాలను సంప్రోక్షణ అనంతరం ఆదివారం ఉదయం తెరిచారు. కోడూరు గంగాభవానీ, కనకదుర్గమ్మ అమ్మవారు, కల్యాణ వెంకటేశ్వరస్వామి, ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామి, హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయాల్లో అర్చకులు సంప్రోక్షణ నిర్వహించారు. సంప్రోక్షణ అనంతరం అమ్మవారు, స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిపారు.

ఆర్‌బీకేల వద్ద లబ్ధిదారుల జాబితాల ప్రదర్శన


మేళ్లమర్తిలంకలో రైతుల జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

మోపిదేవి: ఈ క్రాప్, ఈకేవైసీ పూర్తిచేసిన లబ్ధిదారుల జాబితాలను మండలంలోని అన్ని ఆర్‌బీకేలలో ప్రదర్శిస్తున్నామని మండల వ్యవసాయాధికారి హెబ్సిబారాణి అన్నారు. మండలంలోని అన్ని ఆర్‌బీకేల వద్ద గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులకు సామాజిక తనిఖీ నిమిత్తం చదివి వినిపించారు. వ్యవసాయానికి సంబంధించిన భూముల సర్వే నంబర్లు, పేర్లపై అభ్యంతరాలు ఉంటే ఆయా ఆర్‌బీకేలలో రాతపూర్వకంగా సంప్రదించాలని రైతులకు సూచించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్లు రావి రాంప్రసాద్, రెడ్రౌతు వెంకట రమణ, పలువురు రైతులు, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

నేడు సీహెచ్‌సీ ప్రారంభం

చల్లపల్లి: గ్రామంలో నాబార్డ్ నిధులతో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభోత్సవం సోమవారం జరుగుతుందని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.జ్ఞానరత్న తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు ఆర్‌కే రోజా, విడదల రజని, జోగి రమేష్, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పాల్గొంటారని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


ఆటోవాలాలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం


మోపిదేవి అవుట్ పోస్టులో ఆటో డ్రైవర్లతో సమావేశమైన సీఐ నాగప్రసాద్

నాగాయలంక: డబ్బులు ఎవరికీ ఊరికే రావు..రోజూ పోలీసులను నిందించే బదులు చట్టబద్ధంగా ట్రాఫిక్ రూల్స్ పాటించడం మంచిదని స్థానిక ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం అన్నారు. నాగాయలంక పోలీసుస్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ నిబంధనలు, జరిమానాలపై ఆదివారం ఆటో కార్మికులు, యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, అతివేగం మంచిది కాదని, రహదారుల మధ్యలో నడిరోడ్డు ఆటోలు నిలిపివేయరాదని చెప్పారు. ప్రమాదాల నివారణకు, ప్రజల భద్రతలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే ఏ విధంగా జరిమానాలు విధించేది తెలియజేస్తూ ఫ్లెక్సీ బ్యానర్లను ప్రదర్శించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దు..

స్థానిక మారుతీ కాన్వెంట్ ఆవరణలో ఆదివారం మండల ప్రజలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలు, సొమ్ము ప్రలోభాలకు గురై నష్టపోవద్దని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలను ఎవరికీ షేర్ చేయవద్దని పేర్కొన్నారు. లక్షల బహుమానం వచ్చింది, కొంత సొమ్ము చెల్లించమని కోరేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మోసపూరితమైన స్క్రాచ్ కార్డుల జోలికి పోవద్దని, ఇంటి వద్దే ఉండి లక్షలు సంపాదించవచ్చని, మీ సొమ్ము కాజేసేవారు అధికమైనందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి..

మోపిదేవి: ఆటో డ్రైవర్లు ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలని చల్లపల్లి సీఐ నాగప్రసాద్ అన్నారు. మోపిదేవి అవుట్ పోస్టులో ఆదివారం సాయంత్రం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాహనాలకు సంబంధించి తగిన పత్రాలు విధిగా ఉండాలని, వాహనాలు నడిపే సమయంలో ప్రయాణికులను డ్రైవర్ల పక్కన కూర్చోపెట్టకూడదని, ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. స్థానిక పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దౌర్జన్యాన్ని ఖండిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన

అవనిగడ్డ: ఆటోనగర్ డిపోకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ బొందిలి రాంసింగ్‌పై కావలిలో కొంతమంది దాడి చేయడాన్ని ఖండిస్తూ స్థానిక ఆర్టీసీ డిపోకి చెందిన డ్రైవర్లు, కండక్టర్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. డ్రైవర్‌పై దౌర్జన్యం చేసి దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డిపో మేనేజర్ హనుమంతరావుకు పలు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యదర్శి ఆళ్ల కుమార్, ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఎస్. మహేష్, పలువురు డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.


అవనిగడ్డలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

మచిలీపట్నం టౌన్: కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై జరిగిన దాడికి నిరసనగా మచిలీపట్నం ఏపీఎస్ఆర్టీసీ డిపో పరిధిలో నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) సభ్యులు ఆదివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. స్థానిక డిపో గ్యారేజీ ప్రధాన ద్వారం వద్ద నల్ల బ్యాడ్జీలతో ప్రదర్శనగా నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు పీవీ రావు, కార్యదర్శి ఎం. కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.


మచిలీపట్నంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు, కార్యకర్తలు

పైప్‌లైన్ మరమ్మతు పనుల పరిశీలన

మచిలీపట్నంటౌన్: 29వ డివిజన్‌లో జరుగుతున్న పైప్‌లైన్ లీకుల మరమ్మతు పనులను మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ ఆదివారం పరిశీలించారు. డివిజన్‌లో పైపులైన్ లీక ఏర్పడి నీరు వృథాగా పోతోందని కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు మేయర్ వెంకటేశ్వరమ్మ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆమె ఈ పనులను యుద్ధప్రాతిపదికన చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో మరమ్మతు పనులు ఆదివారం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ యర్ర శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.


పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ

అవనిగడ్డ: మోపిదేవి మండలం కె. కొత్తపాలెంలో దొంగతనం నెపంతో దాడికి గురైన ఎస్టీ మహిళను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పరామర్శించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళను ఆదివారం ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన జరగడం బాధాకరమని చెప్పారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.


బాధితురాలిని ఆస్పత్రిలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

బస్ యాత్ర సభా స్థలం పరిశీలన

అవనిగడ్డ: నవంబర్ 2వ తేదీన అవనిగడ్డలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్‌యాత్ర బహిరంగ సభ ప్రాంతాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పరిశీలించారు. స్థానిక వంతెన సెంటర్ కోడూరు రోడ్డులో పెట్రోల్ బంక్ ముందు ప్రాంతాన్ని ఆయన డీఎస్పీ మురళీధర్‌తో కలిసి ఆయన సభావేదిక ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, సీఐ రమేష్‌తో, పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

150 మందికి ఫిట్‌నెస్ పరీక్షలు



గుడివాడ టౌన్: స్థానిక టీచర్స్ కాలనీ మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహనా సదస్సు నిర్వహించారు. సాయి జనసీ న్యూట్రీషియన్ క్లబ్, మానవతా సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 150 మందికి హెల్త్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక పరికరం ద్వారా వ్యక్తి శక్తి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సంస్థ గుడివాడ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి మాట్లాడుతూ ఈ పరికరం ద్వారా మనిషి ప్రస్తుత సామర్థ్యాన్ని గుర్తించవచ్చన్నారు. వయస్సు, బరువు, ఎత్తు ఆధారంగా ప్రస్తుత వ్యక్తి యొక్క సామర్థ్యం గుర్తిస్తారని, అనంతరం వారిలో ఉన్న రుగ్మతలను అనుసరించి ఆరోగ్యాన్ని ఏ విధంగా మెరుగుపర్చుకోవచ్చో వివరించామన్నారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి దోనేపూడి సరస్వతి, న్యూట్రీషియన్ క్లబ్ డెమోన్‌స్ట్రేటర్లు సునీత, శ్రీలక్ష్మి, సుధశ్రీ, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ గురజాడ సేవలు ఎనలేనివి

పమిడిముక్కల: గురజాడ గ్రామానికి మాజీ సర్పంచ్ గురజాడ వెంకటేశ్వరరావు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చారని వైఎస్సార్ సీపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులపాటి రామచంద్రరావు అన్నారు. గురజాడ ఊరికి ఎంతో ఉపకారం చేశారని, ఆయన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. గురజాడ వెంకటేశ్వరరావు గ్రామానికి దశాబ్దాలుగా అందించిన సేవలకు గుర్తుగా బహుజన సాహిత్య అకాడమీ ఆంధ్రప్రదేశ్ విభాగం అధ్యక్షుడు జంపాన శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం గురజాడలో గ్రామస్తులు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో బీఎస్ఏ నిర్వహించిన అవార్డుల ప్రదానంలో వెంకటేశ్వరరావుకు సంఘ సేవకులుగా ఆచార్య వినోబాభావే పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గురజాడలో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించి అవార్డుల కార్యక్రమ ఫొటోలతో కూడిన ఆల్బమ్‌ను బహూకరించారు. ఈ ఆల్బమ్‌ను రామచంద్రరావు ఆవిష్కరించారు. రామచంద్రరావు మాట్లాడుతూ 20 సంవత్సరాలు సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. బీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ సర్వోదయ సేవా ట్రస్ట్ ద్వారా వైద్య శిబిరం నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు అందజేశారన్నారు. ఐక్యంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని వెంకటేశ్వరరావు గ్రామస్తులకు సూచించారు. తనను సత్కరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, శివలెంక శంభుప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జంపాన కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు రాజులపాటి గురవయ్య, గ్రామ పెద్దలు రాజులపాటి సుబ్బారావు, రామ్మోహనరావు, జగదీష్, సూర్యచంద్రరావు, సుబ్బారావు వెంకటేశ్వరరావును సత్కరించారు.


మాజీ సర్పంచ్ గురజాడ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న రామచంద్రరావు

1 నుంచి ప్రపంచ ఆక్యుపంక్చర్ డే ఉత్సవాలు

పెనమలూరు: ప్రపంచ ఆక్యుపంక్చర్ డే ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ భారత్ (ఉస్పా భారత్) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. ఆయన ఆదివారం కానూరు అశోక్‌నగర్‌లో మాట్లాడారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆక్యుపంక్చర్ సైన్స్ ఏ విధంగా ఉపయోగపడుతుందో ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు, వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులు అందజేస్తారని పేర్కొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

పెనమలూరు: కానూరు గ్రామ పరిధిలో బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు కామయ్యతోపునకు చెందిన సతీష్ ఎలక్ట్రీషియన్ పనులు చేస్తాడు. అతను శనివారం బైక్ పై ఇంటికి వెళుతున్న సమయంలో విజయవాడ వైపు నుంచి వచ్చిన బస్సు అతడ్ని వెనుక నుంచి ఢీ కొట్టింది. గాయపడిన సతీష్‌ను స్థానికులు కానూరులో ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుడి సోదరుడు సాయికౌశిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కామయ్యతోపు వద్ద వ్యక్తికి గాయాలు ..

కానూరు కామయ్యతోపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం షేక్ సుభానీ తాడిగడప వసంతనగర్ కాలువ కట్టపై ఉంటాడు. అతను టైర్లు పంక్చర్ రిపేర్ చేసే షాపు నిర్వహిస్తాడు. అతను టీ తాగేందుకు సైకిల్ పై తాడిగడప నుంచి కామయ్యతోపు వైపునకు సైకిల్‌పై వస్తుండగా బైక్ అతనిని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతడికి గాయాలయ్యాయి. బైక్‌తో ఢీ కొట్టిన వ్యక్తి గుట్టుచప్పుడవ్వకుండా వెళ్లిపోయాడు. బైక్ నంబర్ తెలియలేదు. గాయపడిన బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రీస్తు బోధనలు ఆచరిస్తే ప్రపంచ శాంతి

లక్ష్మీపురం(చల్లపల్లి): క్రీస్తు బోధనలు ఆచరిస్తే ప్రపంచ శాంతి సాధ్యమని విజయవాడ మేత్రాసన పీఠాధిపతి బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు అన్నారు. ఆదివారం లక్ష్మీపురం శివారు సాలిపేట ఆర్‌సీఎం చర్చిలో జపమాల మాత పండుగ నిర్వహించారు. దివిసీమలోని 12 గ్రామాల నుంచి విశ్వాసులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బిషప్ రాజారావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగిస్తూ మానవాళి ప్రేమ, కరుణ, ఓర్పు, సహనంతో జీవనం సాగించాలన్నారు. బిషప్ రాజారావు దివ్య బలిపూజ నిర్వహించి క్రీస్తు సందేశమిచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. సాలిపేట ఆర్‌సీఎం ఫాదర్ ఎం.జోసఫ్, ఫాదర్లు వినోద్, విజయ్, ఉపదేశకులు పర్యవేక్షించారు.


ప్రసంగిస్తున్న విజయవాడ పీఠాధిపతి బిషప్ జోసెఫ్ రాజారావు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విస్తృత సేవలు

పెనమలూరు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విస్తృత సేవలు అందిస్తోందని సెంట్రల్ విజిలెన్స్ డిపార్టుమెంట్ ఏజీఎం సచిన్‌దేవ్ అన్నారు. మచిలీపట్నం రీజినల్ ఆఫీస్ సహకారంతో పోరంకి శాఖ ఆదివారం పెనమలూరు సెంటర్ కిలారు ఎస్టేట్‌లో ద్వారా మహిళలకు రుణ మేళా, విజిలెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సచిన్ దేవ్ మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా బంగారు రుణాలు, గృహ రుణాలు, విద్యా రుణాలు, పొదుపు సంఘాలకు రుణాలు అందజేస్తున్నామన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 35 గ్రూపులకు రూ.5 కోట్ల రుణాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో రీజినల్ హెడ్ కె.వెంకట్రావు, జోనల్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్ఎల్.గోపాలకృష్ణ, రీజినల్ విజిలెన్స్ ఆఫీసర్ కె.వెంకటరాజు, పోరంకి బ్రాంచ్ మేనేజర్ ఎస్.నందకృష్ణ పాల్గొన్నారు.

- **పెనమలూరు:** అంతర్జాతీయ స్ట్రోక్ డే సందర్భంగా కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. న్యూరాలజిస్టులు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి కారణంగా రకరకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా బ్రెయిన్, గుండె సంబంధిత వ్యాధులు అధికంగా నమోదు అవుతున్నాయని వివరించారు. వీటి వలన ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందన్నారు.